శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## సంక్రాంతికి ఆర్టీసి ప్రత్యేక బస్సు సర్వీసులు



**కావలి, జనవరి 7 ప్రభాతవార్త** సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కావలి ఆర్టీసి ప్రత్యేక బస్సు సర్వీసులను సాధారణ చార్జీలతో నడుపుతున్నట్లు కావలి ఆర్టీసి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్రాలు, వివిధ ప్రాంతాల నుండి సంక్రాంతికి స్వగ్రామానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక ఆర్టీసి బస్సు సర్వీసులను నడుపుతున్నామన్నారు. గతంలో పండుగ స్పెషల్ సర్వీసులను 50 శాతం అదనపు చార్జీతో నడపడం జరిగేదన్నారు. అయితే ప్రస్తుతం ఆర్టీసి మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సాధారణ చార్జీలతో నడపడంతో పాటు ప్రత్యేక రాయితీలను కూడా కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. రానుపోను ముందుగా రిజర్వేషన్ చేయించుకున్న వారికి పది శాతం, వృద్ధులకు 25 శాతం చార్జీలో రాయితీ ఇస్తున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాసులు తెలిపారు. ఈ నెల 9వ తేది నుండి 12వ తేది వరకు కావలికి వచ్చేందుకు, 15వ తేది నుండి 18వ తేది వరకు తిరిగి హైదరాబాద్, బెంగుళూరు తదితర ప్రాంతాలకు వెళ్లే వారి కోసం బస్సులను నడుపుతున్నామన్నారు. ప్రయాణికులు ముందుగా సీట్లను రిజర్వేషన్ చేసుకోవాలని ఆయన కోరారు.

## ముగిసిన విఎస్‌యు అథ్లెటిక్ శిక్షణ



**కావలి, జనవరి 7 ప్రభాతవార్త** కావలి జవహర్ భారతి డిగ్రీ కళాశాల డిఆర్ క్రీడా ప్రాంగణంలో వారం రోజుల పాటు జరిగిన సింహపురి యూనివర్శిటీ అథ్లెటిక్ క్రీడాకారుల క్రీడా శిబిరం శనివారంతో ముగిసింది. ఈ ముగింపు శిబిరంలో ఇన్‌చార్జ్ ఫిజికల్ డైరెక్టర్ ప్రసాద్‌రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా జవహర్ భారతి డిగ్రీ కళాశాల రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. క్రీడాకారులకు యూనివర్శిటీ తరపున ట్రాక్‌సూట్‌లు, జెర్సీ షార్ట్ సూట్స్ కంపెనీవి ఇచ్చి అభినందించారు. అంతర్ విశ్వవిద్యాలయ అథ్లెటిక్స్ పోటీలలో ప్రతిభను చాటిచెప్పి విఎస్‌యుకు మంచిపేరు తేవాలని కోరారు. విఎస్‌యు విసి సుందర్‌వల్లి క్రీడాకారులకు మంచి ప్రోత్సాహాన్ని అందిస్తుందన్నారు. కోచ్ మణికంఠ, ప్రవీణ్, మేనేజర్ కృష్ణమూర్తిల పర్యవేక్షణలో శిక్షణ పొందిన విఎస్‌యు అథ్లెటిక్ క్రీడాకారులు ఈ నెల 9వ తేది తమిళనాడు రాష్ట్రంలో జరగనున్న అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలలో పాల్గొంటారన్నారు. ఈ ముగింపు కార్యక్రమంలో అనుమాలశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ చర్యను ఖండించిన సీపీఎం



**తోటపల్లిగూడూరు, జనవరి 7, ప్రభాతవార్త:** ప్రతిపక్షాలను ప్రచారం చేయకుండా ఇబ్బంది పెట్టేందుకే ప్రభుత్వం జీవో నెంబరు 1 దుర్మార్గపు చట్టాన్ని ప్రవేశపెట్టడం దారుణమని శనివారం నరుకూరు సీపీఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ చర్యను తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో సభలుసమావేశాలు నిరసనలు జరుపుకోవడం సర్వసాధారణమన్నారు. కేవలం తమ ప్రాబల్యం తగ్గిపోతుందన్న కారణంతో ప్రతిపక్షాలను ఇరుకున పెట్టేందుకు బ్రిటీషు కాలం నాటి చట్టం తెచ్చారని ఎద్దేవా చేశారు. ప్రజల హక్కులను కాలరాసే ఇలాంటి చట్టాలను ఉపసంహరించుకోవాలని మండల కార్యదర్శి వేగూరు వెంకయ్య నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు నాయకులు మారుబోయిన రాజా రాష్ట్ర ప్రభుత్వ చర్యను ఖండించారు. ఈ కార్యక్రమంలో నరుకూరు ఆటో సెంటర్ యూనియన్ అధ్యక్షులు నాశిన పరశురామయ్య, ఉపాధ్యక్షులు కుమారి వెంకటశేషయ్య, సహాయ కార్యదర్శి ఎ.గోపి, ట్రెజరర్ కమిటీ సభ్యులు గణేష్, మనోహర్, భాస్కర్, బాషా, శ్రీను, రోడ్డు మార్జిన్ వ్యాపారస్థులు జయమ్మ, పుల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీనర్శింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



**వింజమూరు, జనవరి7 ప్రభాతవార్త:** వింజమూరు మండలం నల్లగొండ్ల గ్రామంలో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేతీ శ్రీలక్ష్మీ నర్శింహ స్వామి ఆలయంలో శనివారం ఇండియన్ పాస్‌పోర్ట్ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఇఒ మల్లిఖార్జునరెడ్డి, అర్చకులు పరాంకుశం సత్యనారాయణాచార్యులు పూర్ణకుంభంతో, ఆలయ మర్యాదలతో శ్రీనివా సులురెడ్డికి స్వాగతం పలికారు. వైసిపి యువజన నాయకుడు అంకినపల్లి శివశంకర్‌రెడ్డి, అన్నపురెడ్డి వెంగళరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం పకడ్బందీగా అమలు చేయాలి



**నెల్లూరు అర్బన్, జనవరి 7, ప్రభాతవార్త:** జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం పకడ్బంధీగా అమలు చేయడంతో పాటు ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులకు సంబంధించి నమోదైన కేసులను సత్వరమే పరిష్కరించి బాధిత కుటుంబాలకు అందించగలిగే విధంగా అధికారులు పని చేయాలని జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్‌బాబు పేర్కొన్నారు. శనివారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ చక్రధర్‌బాబు, ఎస్పీ సి.హెచ్.విజయరావు, శాసనమండలి సభ్యులు బల్లి కళ్యాణ చక్రవర్తితో కలిసి జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసులను డివిజన్‌ల వారీగా సమీక్షించి కేసుల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి సారించి బాధిత కుటుంబాలకు న్యాయం అందించగలిగే విధంగా పని చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి నుంచి బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఒక ప్రత్యేకమైన ప్రణాళికతో ముందుకు వెళుతున్నామన్నారు. జిల్లా జనాభాలో 32 శాతం ఎస్సీ, ఎస్టీ జనాభా ఉన్నారని, వారికి రాజ్యాంగపరంగా కల్పించిన హక్కులు, బాధ్యతలను పరిరక్షించడంతో పాటు వారి సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా అమలయ్యేలా సంబంధిత శాఖల అధికారులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. జిల్లాలో నవరత్నాల కార్యక్రమంలో భాగంగా సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా బడుగు, బలహీన వర్గాల ప్రజలకు పారదర్శకంగా సంక్షేమ కార్యక్రమాలను అందించడం జరుగుతుందన్నారు. కేసుల నమోదులో జాప్యం ఉండకూడదని, బాధితులకు న్యాయం జరిగేలా పారదర్శకంగా విచారణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో రెవెన్యూ, పోలీసు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ఎస్సీ, ఎస్టీల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు జాప్యం చేయకుండా జారీ చేయాలన్నారు. అలాగే ఎస్సీ ఎస్టీ బాధితులకు త్వరితగతిన నష్టపరిహారాన్ని చెల్లించాలన్నారు. ప్రతి మూడు నెలలకు ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఎస్సీ ఎస్టీ కాలనీలకు రోడ్లు, తాగునీటి సమస్య నివేశనా స్థలాలు, ఇళ్ల మంజూరు తదితర సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అట్రాసిటీ కేసుల పరిష్కారంపైన సివిల్ రైట్స్ డే నిర్వహణ పైన ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ డివిజనల్ అధికారులకు సూచించారు. ప్రతి సచివాలయంలో ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంపై ప్రజలకు అవగాహన కలిగే విధంగా బ్యానర్లను, వాల్‌పోస్టర్లను ఏర్పాటు చేయాలని కమిటీ సభ్యులు, అధికారుల దృష్టికి తీసుకురావడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ, సోషల్ వెల్‌ఫేర్ డీడీ వెంకటయ్య, నెల్లూరు, కావలి, ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ అధికారులు మాలోల, శీనానాయక్, కరుణకుమారి, కమిటీ సభ్యులు కె.రఘు, శేషం సుదర్శనం, పి.సుబ్బరాయుడు, కె.సి.పెంచలయ్య, డి.ప్రసన్న గణపతి, ఖాజారసూల్, ఎం.సురేంద్రరెడ్డి, సాయిప్రసాద్, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మాలకొండలో ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి



వలేటివారిపాలెం జనవరి 7, ప్రభాతవార్త మండలంలోని మాలకొండ నందలి శ్రీమాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామివారిని శనివారం కందుకూరు శాసనసభ్యులు మానుగుంట మహీధర్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రసేవాదళ్ అధ్యక్షులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డితోపాటు పలువురు భక్తులు దర్శించు కున్నారు. వీరికి ఆలయప్రధాన అర్చకులు గౌరీశంకర్ ప్రత్యేక పూజలు చేయించారు. తద్వారా స్వామి వారికి రూ.4,95,308లు మేర ఆదాయం సమకూరింది. ఆలయ ప్రధాన అర్చకులు గౌరీ భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. భక్తుల సందర్శనతో స్వామివారికి అష్టోత్తర పూజల వలన రూ.3,500లు, కుంకుమార్చన పూజల ద్వారా రూ.20,400లు, తలనీలాలు టిక్కెట్లు వలన రూ.21,975 లు, వాహనపూజల వలన రూ.1,100 లు, ప్రత్యేకదర్శనం రూ.1,06,600లు, స్థలపురాణం పుస్తకముల అమ్మకం వలన రూ.1,440లు, రూముల అద్దెలు రూ.15,280లు, కవర్లు అమ్మకం వలన రూ.3,300లు, అన్నదానం నిమిత్తం రూ.1,81,068లు, లడ్డుప్రసాదం అమ్మకాల వలన రూ.1,39,995లు, విరాళాలు ద్వారా రూ.650లు వెరసి రూ.4,95,308లుచొప్పున స్వామి వారికి భక్తులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏసీ కె.బి శ్రీనివాసరావు, ఎస్సై సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## అధాని వరల్డ్ స్కూల్ లో వింటర్‌క్యాంప్



**ముత్తుకూరు జనవరి7 ప్రభాతవార్త-విద్య** అధాని వరల్డ్ స్కూల్‌లో వింటర్ క్యాంప్స్‌ను నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ రితేష్ మోహతా పేర్కొన్నారు. ఆరు సంవత్సరాల వయస్సు నుండి 16 సంవత్సరాల వయ్యస్సు ఉన్న విద్యార్థులకోసం నిర్వహిస్తున్నామన్నారు. జనవరి 9 నుండి13తేదీ వరకు చేపట్టనున్న ఈ క్యాంపు ఉదయం 8గంటలనుండి 11.45 నిముషాల వరకు జరుగుతుందన్నారు. ఈ క్యాంపులో బాసెట్‌బాల్, ఖోఖో, ఏరోబిక్స్, జుంబా, లైవ్‌స్కిల్ వంటివి నేర్పబడుతాయన్నారు. ఈ క్యాంపులో విద్యార్థులు ఉచితంగా పాల్గొనవచ్చని రిజిస్ట్రేషన్ కోరకు 9398788633 కు కాల్ చేయ్యాలని కోరారు.

## మున్సిపల్ కార్మికులపై వేధింపులకు పాల్పడుతున్న మహేష్‌పై చర్యలు చేపట్టాలి




**కావలి, జనవరి 7 ప్రభాతవార్త** కావలి మున్సిపల్ కార్మికులపై శానిటరీ ఇన్స్‌పెక్టర్ బొడ్డు ఉమామహేష్ వేధింపులకు గురి చేస్తున్నాడని అతనిపై చర్యలు చేపట్టాలని ఎఐటియుసి నేతలు, మున్సిపల్ కార్మిక నేతలు డిమాండ్ చేశారు. శనివారం కావలి మున్సిపల్ కార్యాలయం వద్ద ఎఐటియుసి ఆధ్వర్యంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు నిరసన నినాదాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిపిఐ కావలి నియోజకవర్గ కార్యదర్శి కె.నాగరాజు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) జిల్లా కార్యదర్శి జి.కిషోర్, అధ్యక్షులు ఎండ్లూరి ఆదినారాయణ, గౌరవాధ్యక్షులు మల్లి అంకయ్య, ఏసుపోగు ప్రభావతి, బి.రాజేష్, ఆర్.వెంకటేశ్వర్లు, గుర్రం వేణు, గుంజి అంకయ్య, తదితరులు పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పాలనకు వ్యతిరేకంగా కావలి మున్సిపల్ కమిషనర్ బి.శివారెడ్డి, కార్యాలయ గుమస్తా శానిటరీ ఇన్స్‌పెక్టర్‌గా చెప్పుకుంటున్న బొడ్డు ఉమామహేష్‌లు విధులు నిర్వహిస్తున్నారని విమర్శించారు. మున్సిపల్ కార్మికులకు ప్రతి రోజు ఉదయం 5.30 గంటలకు శానిటరీ సెక్రటరీ మస్టర్ వేయడం జరుగుతుందన్నారు. శానిటరీ సెక్రటరీని పక్కన పెట్టి శానిటరీ ఇన్స్‌పెక్టర్‌గా వ్యవహరిస్తున్న ఆఫీసు గుమస్తా బొడ్డు ఉమామహేష్ మస్టర్ వేస్తున్నాడన్నారు. కార్మికులపై పెత్తనం చెలాయిస్తున్నాడన్నారు. నేను లోకల్ చెప్పిందే వినాలి, సియం జగన్‌రెడ్డి చెప్పినా వినేది లేదు, మున్సిపల్ కమిషనర్, నేను చెప్పిందే వినాలంటూ కార్మికులను బెదిరిస్తున్నాడన్నారు. ఈయన ఆగడాలు మితిమీరుతున్నాయన్నారు. కావలి మున్సిపల్ కమిషనర్, బొడ్డు ఉమామహేష్‌లపై విజిలెన్స్ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. కరుడుగట్టిన నేరస్తులైన ఇలాంటి అధికారులపై చర్యలు గైకొంటూ సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

# ప్యాకేజీ పంపిణీలో ఏకపక్షంగా వ్యవహరించవద్దు



**ముత్తుకూరు, జనవరి7 ప్రభాతవార్త:** ప్యాకేజీ పంపిణీ విషయంలో ముత్తుకూరు ఎంపిడీఓ ఏపక్షంగా వ్యవహరిస్తున్నారని మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ముత్తుకూరు బస్టాండునుండి తాశీల్దారు కార్యలయం వరకు ర్యాలీగా వచ్చి తాశీల్దార్‌కు మనోహర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తమ ప్రభుత్వ హయాంలో ప్రతి కుటుంబానికి రూ.43500 పంపిణీ చేయటానికి శ్రీకారం చుడితే ఈరోజు ఈ వైకాపా ప్రభుత్వ హయాంలో దానికి కోత పెట్టి రూ.25వేలకు తగ్గించారని ఆందోళన వ్యక్తంచేశారు. మత్యకారుల విషయంలో ఎంపిడీఓ ఏకపక్షంగా వ్యవహరించటం విడ్డూరంగా ఉందన్నారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్యాకేజీ దక్కేలా తెలుగుదేశం పార్టీ పోరాడుతుందన్నారు. మత్యకారేతర ప్యాకేజీ పంపిణీ కోసం రూ.50.20 కోట్లు పంపిణీ చేస్తూ 2019జనవరి22న జీఓ నెంబర్ 8 ద్వారా ప్రభుత్వ ఉత్తర్వులు తేవటం జరిగిందన్నారు. ముత్తుకూరు మండలంలోని ఉప్పుకాలవ పరిహార ప్రాంతాల్లో ఉన్న ఏడు పంచాయితీలతోపాటూ చిల్లకూరు మండలంలోని తమిళపట్నం, లింగవరం పంచాయితీలకు కూడా మత్యకారేతర ప్యాకేజీ మంజూరైందన్నారు. అయితే మండలంలోని అర్హులైన 1000మందికి ఈ ప్యాకేజీ దక్కలేదన్నారు. అర్హులైన అందరికి ప్యాకేజీ అందించాలని లేకుంటే భారీ ఎత్తును పోరాడేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, మండల టిడిపి అధ్యక్షులు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, యూత్ అధ్యక్షులు మునిరెడ్డి, ఉపాధ్యక్షులు రాఘూల శివకృష్ణ, మండల నాయకులు పాల్గొన్నారు.

# హరేరామ.. హరేకృష్ణ నామస్మరణ హోరులో జగన్నాధ రథయాత్ర







**కావలి, జనవరి 7 ప్రభాతవార్త** హరేకృష్ణ, హరే కృష్ణ...కృష్ణకృష్ణ హరేకృష్ణ...హరేరామ, హరేరామ నామస్మరణ, భక్తుల నృత్యాల హోరులో జగన్నాధ రథయాత్ర కావలిని ఎంతగానో ఆకట్టుకుంది. శనివారం సాయంత్రం కావలి బృందావనం హౌసింగ్ కాలనీ నుంచి ప్రారంభమైన జగన్నాధ రథయాత్ర ఆర్టీసి సెంటర్, ట్రంకురోడ్డు, ఐదులాంతర్ల సెంటర్, కృష్ణుడు బొమ్మ సెంటర్, శివాలయం వీధి, తుమ్మలపెంట బస్టాండ్ మీదుగా పిహెచ్‌ఆర్‌ఆర్ కళ్యాణమండపానికి చేరింది. భారీ పోలీస్ బలగాల బందోబస్తు మధ్య వందలాది మంది భక్తుల భక్తిపారవశ్యం మధ్య విద్యుత్ దేదీప్యమాన అలంకారాలతో సాగిన జగన్నాధ రథయాత్ర భక్తులు దర్శించుకొని తరించారు. విశేష పూల అలంకారాలతో కనులవిందుగా జగన్నాధ రథయాత్ర సాగింది. రథయాత్ర మార్గమంతా ప్రసాద ప్యాకెట్ల వితరణ జరిగింది. కోలాట భజన బృందాలు, భజన మండళ్ల నృత్యాలు, దేవుళ్ల వేషధారణలు, ఇస్కాన్ సభ్యుల నృత్యాలు, డప్పు వాయిద్యాల మధ్య అంగరంగ వైభవంగా జగన్నాధ రథయాత్ర జరిగింది.

ఈ రథయాత్రలో నెల్లూరు జిల్లా ఇస్కాన్ మందిర బాధ్యులు సుఖదేవ మహరాజ్ ఆధ్వర్యంలో ఈ రథయాత్ర సాగింది. కావలి ఇస్కాన్ సెంటర్ బాధ్యులు చంద్రశేఖర్‌ప్రభు, యాత్ర కమిటీ నిర్వాహకులు డాక్టర్ మాధవరెడ్డి, నల్లూరు రవికుమార్, మక్కే వెంకట సుబ్బయ్య, ఆరికట్ల మధుసూదన్‌రావు, ఆక్వాకల్చర్ అధిపతి వేలూరు జయచంద్రనాయుడు, రమేష్‌రెడ్డి, హోమియో డాక్టర్ వింతా కృష్ణారెడ్డి, పట్టణ ప్రముఖులు, వ్యాపారస్తులు పాల్గొన్నారు. కళ్యాణమండపంలో ఇస్కాన్ స్వాములు, ముఖ్యఅతిధులు జగన్నాధ రథయాత్రపై మాట్లాడారు. 56 వంటకాలతో హారతి కీర్తన, నివేదన, దీపహారతులు జరిగాయి. భక్తులందరికి విందు భోజన ప్రసాదాలు అందజేశారు.

# పెన్షన్ దారులకు జీతాలు ఇవ్వాలేని ప్రభుత్వం

**సీతారామపురం జనవరి 7 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షన్లు తీసుకునే వారికి సకాలంలో జీతాలు చెల్లించాలని నెల్లూరు,చిత్తూరు,ప్రకాశం పిడిఎఫ్ గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రవేటు పాఠశాలలను సందర్శించి తొలి ప్రాధన్యత ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్ధించారు. అనంతరం యుటిఎఫ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతు నెల ప్రారంభమై వారం ముగుస్తున్నా ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షన్ దారులకు జీతాలు చెల్లించకపోవడం సిగ్గు చేటు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్దిక అసమర్దత విధానాల వల్ల ప్రభుత్వ ఉద్యోగులు,ఉపాధ్యాయులు 1 వ తేదిన జీతాలు పొందలేకపోతున్నారని ప్రభుత్వ ఉద్యోగుల పిఎఫ్,ఎపిజిఎల్ఐ సిపిఎఫ్ నగదు ప్రభుత్వ అవసరాలకు వాడుకొని సుమారు 2 వేల కోట్ల రూపాయాల పిఎఫ్ బిల్లులు పెండింగ్‌లో ఉంచారని అన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 50 వేల టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటిని భర్తి చేయకుండా నిరుద్యోగులతో ప్రభుత్వం ఆటలాడుతుందని అన్నారు.రాష్ట్రంలో వివిధ శాఖలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కేజిబిలలో పనిచేస్తున్న పార్ట్‌టైం ఇనస్పెక్టర్లకు కనీస పనివేళలు కల్పించాలని,మహిళా వార్డన్లను నియమించాలని పోరాడతామని అన్నారు.ఈకార్యక్రమంలో యుటిఎఫ్ మండల అద్యక్ష ప్రధాన కార్యదర్శులు గుండ్లవేటి వెంకటేశ్వర్లు,సిహెచ్ ప్రతాప్,జిల్లా కార్యదర్శి ఎడమ తిరుపతయ్య, బోగ్యం శ్రీనివాసులు,సిహెచ్ రవీంద్రారెడ్డి, బి . జైరామిరెడ్డి,రంతుజానీ, తదితరులు పాల్గొన్నారు.

## దళిత, గిరిజనులపై అఘాత్యాలను అరికట్టాలి



**కావలి రూరల్, జనవరి 7 ప్రభాతవార్త:** దళిత, గిరిజనులు, అణగారిన వర్గాలపై జరుగుతున్న అఘాత్యాలను వెంటనే అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి.మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కావలి, జలదంకి మండలాల ఆధ్వర్యంలో శనివారం కావలి ఆర్డీవో కార్యాలయ అధికారి సూర్యనారాయణసింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టి.మాల్యాద్రి మాట్లాడారు. ఇటీవల కాలంలో కావలి ప్రాంతంలో దళితులపై దాడులు, హత్యలు, హత్యాచారాల పరంపర కొనసాగుతుందన్నారు. దగదర్తి మండలం ఉలవపాళ్ళకు చెందిన గోచిపాతల తేజపై హత్యాయత్నం, తలారి రవి పొలాన్ని ధ్వంసం చేయడం, ముసునూరులో కరుణాకర్ ఆత్మహత్య,రామానుజాపురంలో దళిత యువతిని అత్యాచారం చేసి హత్య చేయడం, తదితర ఘోరమైన సంఘటనలు జరిగాయన్నారు. ఈ అఘాత్యాలు చేసిన వారిని ప్రధాన రాజకీయ పార్టీలు బలపరుస్తున్నాయన్నారు. దోషులను కఠినంగా శిక్షించి ఇటువంటి సంఘటనలు నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అణగారిన తరగతులు అందరితో సమానమని సోషల్ వెల్ఫేర్, రెవెన్యూ, పోలీస్ శాఖలు సమన్వయంతో ప్రచారం చేయాలన్నారు. దళిత, గిరిజనులకు, అణగారిన వారికి భూమి, ఉపాధి, పునరావాసం కల్పించేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం కావలి మండల అధ్యక్షులు పి.సీతారామయ్య, సిఐటియు నాయకులు షేక్ అమీర్‌బాషా, యాకసిరి లక్ష్మమ్మ, కె.రమేష్, కె.జాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ధిక సహాయం అందించిన ఇంటూరి నాగేశ్వరరావు



**గుడ్లూరు, జనవరి 7, ప్రభాతవార్త :** గుడ్లూరు మండలం అడవిరాజుపాలెం గ్రామానికి చెందిన టీడీపీ పార్టీ కార్యకర్త గోచిపాతల రమేష్, కోటేశ్వరమ్మ దంపతుల కుమారుడు చందు(నాని) ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మతిస్థిమితం కోల్పోయాడు. కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం ఇంఛార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు శనివారం చందును పరామర్శించి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. చందు కోలుకునేంతవరకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. వైద్య ఖర్చుల కోసం రూ.20వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, గ్రామ పార్టీ అధ్యక్షులు గుండ్లపల్లి వెంకటేశ్వర్లు, నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గోచిపాతల మోషే, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు గాయపాటి శ్రీనివాసరావు, నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షులు మద్దసాని కృష్ణ, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు తాటిపర్తి రామకృష్ణ, మాజీ జడ్పీటీసీ అక్కిలగుంట ప్రకాశం, అక్కిలగుంట వరయ్య, మాజీ ఎంపీటీసీ మద్దసాని రమణయ్య, నాయకులు ఆశీర్వాదం, ఏసురత్నం, చంద్రయ్య, బొజ్జా వేణు, గుండ్లపల్లి బ్రహ్మయ్య, మద్దసాని శ్రీను తదితరులు ఉన్నారు.

## చెర్లోయడవల్లిలో ఉచిత వైద్యశిబిరం

**ఆత్మకూరు,జనవరి7ప్రభాతవార్త:** మండలంలోని సి.హెచ్.యడవల్లిలో శనివారం మాజీ సర్పంచ్ కేతా విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈశిబిరంలో డాక్టర్ ఎం. ప్రమీల పాల్గొని 125మంది రోగులను పరిక్షించి మందులు అందజేశారు. ముఖ్యంగా షుగర్, బిసి పరిక్షలు నిర్వహించారు. షుగర్, బిపి నిర్ధారించబడిన వారికి మూడు నెలలకు సరిపడా మందులను పంపిణీ చేశారు. ఈ మందులను ఆలంబన ఫౌండేషన్-ఇండియా వారు సరఫరా చేశారు. ఈకార్యక్రమంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అల్లంపాటి వెంకటరాజేష్, ఎఎన్‌ఎంలు షంషాద్, మాధురి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## దళితులపై దాడులకు దళిత ఎమ్మెల్యేలు ఏంచేస్తున్నారు



**ఉలవపాడు,జనవరి7,ప్రభాతవార్త:** రాష్ట్రంలో దళితులపై అనేక దాడులు జరుగుతుంటే దళిత ఎమ్మెల్యేలు ఏంచేస్తున్నారని ఉలవపాడు మండల టిడిపి అధికార ప్రతినిధి చింతల సింగయ్య ప్రశ్నించారు.వైసీపి నాలుగేళ్ల పాలనలో దళితులపై దాడులు అధిక మైయ్యాయని చెప్పారు.వారి హక్కులు,రక్షణకు భంగం కలిగిందని చెప్పారు.ఒక దళిత బిడ్డను ఎమ్మెల్సీ హత్య చేస్తే ఏ దళిత ప్రజాప్రతినిధి ప్రశ్నించకపోవడం భాదాకరమన్నారు.పైగా ఆ ఎమ్మెల్సీకి పూలదండలతో స్వాగతం పలకడం సిగ్గుచేటు విషయమన్నారు.డాక్టర్ సుధాకర్ నడిరోడ్డుపై హింసించి ఆయన మరణానికి కారణమైన వారి పై ఎందుకు చర్యలు తీసుకోలేదో అదిష్టానాన్ని ప్రశ్నించలేని దళిత ఎమ్మెల్యేలు తలదించుకోవాలన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా దళితులను వేదించడం,మౌళిక వసతులు కల్పించకపోవడం,ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్లు నిలిపివేయడంపై మాట్లాడలేని దళిత ఎమ్మెల్యేలు తక్షణమే వారి పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## సినీహీరో బాలకృష్ణాకు అభిమాని పోటో బహుకరణ



**ఇందుకూరుపేట జనవరి 7 ప్రభాతవార్త:** నందమూరి తారకరామారావు శతజయంతిని పురస్కరించుని వీరసింహారెడ్డి ప్రీ రిలీజ్ వేడుకలలో ఇందుకూరుపేట మండలం పొన్నూరు గ్రామానికి చెందిన నందమూరి బాలకృష్ణా పా న్స్ అద్యక్షుడు ముంగర కృష్ణ ప్రసాద్ ఒంగోలులోని బిఎంఆర్ కన్వెన్షన్ గ్రౌండ్‌లో నందమూరి బాలకృష్ణను కలిసి ఆయనకు నందమూరి తారకరామారావు పోటోను బహుకరించారు.ఈ సందర్భంగా బాలయ్యతో కొద్దిసేపు ముచ్చటించారు.ఇరువురు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

## కేశమనేనిపల్లిలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి



**కలువాయి జనవరి 7 ప్రభాతవార్త:** కలువాయి మండలంలోని కేసమనేనిపల్లి మరియు తిరుమలపాడులో మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ " ఇదేం ఖర్మ " మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఆయన ఇంటింటికి తిరిగి అభిప్రాయాలు స్వీకరించారు. అనంతరం జరిగిన కార్య క్రమంలో ప్రజలు అనేక సమస్యలపై మాట్లాడారు.ఈకార్యక్రమంలో పార్లమెంట్ క్లస్టర్ ఇంచార్జిలు,నియోజకవర్గ అనుబంధ కమీటి,మండల కమీటి సభ్యులు, మండల అనుబంధ కమీటి సభ్యులు,పార్లమెంట్ అనుబంధ కమీటి సభ్యులు,యూనిట్ ఇంచార్జిలు, బూత్ కన్వీనర్లు, అన్ని గ్రామాల ముఖ్యమైన నాయకులు,పార్టీ కార్యకర్తలు సభ్యులు పాల్గొన్నారు.

## ప్యాకేజీ పంపిణీ విషయంలో సోమిరెడ్డి వాఖ్యలు అవాస్తవం



**ముత్తుకూరు,జనవరి7 ప్రభాతవార్త:** మత్యకారేతర ప్యాకేజీ పంపిణీ విషయంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చేసే వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవం అని వైకాపా మండలాధ్యక్షులు పోలిరెడ్డి చిన్నపరెడ్డి పేర్కొన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. పోర్టు ప్రభావిత గ్రామాలకు సంభందించి మత్యకారేతర ప్యాకేజీ తీసుకురావటానికి ప్రసుత్త మంత్రి, అప్పటి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి కృషిమరువలేనిదన్నారు. మండలంలోని 20 పంచాయితీల్లో ఒక్కో కుటుంబానికి రూ.20వేలు పంపిణీ చేసిన ఘనత కాకాణికే దక్కుతుందన్నారు. సాకేంతిక కారణాల వలన, అకౌంట్స్‌లో లోపాల వలన కొంతమందికి ప్యాకేజీ పడలేదని, దీనిని విమర్శించటం తగదన్నారు. అధికారులు ఎల్లపుడూ రాజకీయ పార్టీలకు అనుకూలంగా ఉండరని, వారి విదులు వారు నిర్వహిస్తారని, ఎంపిడీఓ పై సోమిరెడ్డి విమర్శలు చేయటం సిగ్గుచేటన్నారు. టిడిపీ ఎన్ని యక్తులు పనిన్నా వైకాపాను ఏమీ చేయలేరన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మెట్టవిష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసి నెల్లూరు శివప్రసాద్, కాకుటూరు లక్ష్మన్‌రెడ్డి, ఎంపిటీసి సభ్యులు నవీద్‌బాషా,ముత్యం గౌడ్, సూరి, తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా క్రికెట్ పోటీలు



**వరికుంటపాడు జనవరి 7 ప్రభాతవార్త:** సంక్రాంతి సందర్భంగా మండలంలోని ఎర్రంరెడ్డిపల్లి గ్రామంలో కాకర్త చారిటబుల్ ట్రస్టు ఆద్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను గ్రామ సర్పంచ్ నాదెండ్ల రంగయ్య శనివారం ప్రారంభించారు. ఈ పోటీలకు నెల్లూరు ప్రకాశం జిల్లాలోని 30 టీంలు పోటీలు పడుతున్నాయి.మొదటి బహుమతిగా 30 వేల రూపాయాలు,ద్వితియ బహుమతి 20 వేలరూపాయాలు, తృతీయ బహుమతి పది వేలు రూపాయాలు అందించనున్నారు.ఈకార్యక్రమంలో కమీటి సభ్యులు ఎం కేశవ,శ్రీకాంత్, బ్రహ్మయ్య, మనోహార్,స్దానిక వైకాపానేత నాదెండ్ల రమేష్,యువకులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయినిలకు 'పూలే' అవార్డు



**చేజర్ల,జనవరి7ప్రభాతవార్త:** మహిళావిద్యాభివృద్ధికి పాటుపడిన తొలి ఉపాధ్యాయిని సావిత్రిభాయిపూలే ఆదర్శవంతురాలని యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు మధు పేర్కొన్నారు. శనివారం చేజర్ల యుటిఎఫ్ కార్యాలయంలో ఉపాధ్యాయినిలకు మెమొంటోలు, శాలువాలతో సత్కరించారు. మండలం లోని ప్రాధమిక, ప్రాధమికోన్నత ,ఉన్నత గురుకుల విద్యాలయాల నుంచి 9మందిని ఎంపికచేశారు. చేజర్ల ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయిని పి.హైమావతి మాట్లాడుతూ మహిళా విద్యాభివృద్ధి కోసం పాటుపడిన సావిత్రిభాయి పూలేని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఎన్నో కష్టనష్టాలకోర్చి తాను విద్యనభ్యసించడంతోపాటు ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేసి మహిళాభివృద్ధికి పాటుపడడం చెప్పుకోదగిన విషయమన్నారు. ఆనాడు ఆమె వేసిన భీజమే నేడు మహిళల ఉన్నతికి కారణమైందన్నారు. ఉపాధ్యాయినిలను పలువురు సన్మానించి అభినందనలు తెలిపారు.ఉత్తమ ఉపాధ్యాయులుగా ఆదూరుపల్లి గురుకుల పాఠశా నుంచి పి.శైలజాకుమారి, చేజర్ల ఉన్నతపాఠశాల నుంచి ఎ.విమల, పి.అనితారాణి , వై.మంజూష, మాముదూరు ఉన్నతపాఠశాల నుంచి పి.భువనేశ్వరి, కొల్లపనాయుడుపల్లి ప్రాధమికోన్నత పాఠశాల నుంచి పి.భవాని, మడపల్లి ప్రాధమిక పాఠశాల నుంచి జి.నీరజ, టికెపాడు ప్రాధమిక పాఠశాల నుంచి టి.నాగమణి, గొల్లపల్లి హెచ్‌డబ్ల్యు పాఠశాల నుంచి ఎం.అరుణ, ఏటూరు మెయిన్ ప్రాధమిక పాఠశాల నుంచి సి.హెచ్.మాధవి, చిత్తలూరు ప్రాధమిక పాఠశాల మెయిన్ నుంచి ఎం.అపర్ణలత, ఓబులాయపల్లి హెచ్‌డబ్ల్యు నుంచి విద్యావాలంటీర్ ఆదిలక్ష్మిలను సన్మానించారు. ఈకార్యక్రమంలో చేజర్ల మండల యుటిఎఫ్ అధ్యక్షులు ఎన్.రమణయ్య, కార్యదర్శి ఆర్.వెంకటకృష్ణారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు మాదాల రవిబాబు, మండలంలోని పలువురు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# భూముల రీసర్వేపై సమీక్ష



**చేజర్ల,జనవరి7ప్రభాతవార్త:** మండలంలోని ఏటూరు, కోటితీర్థం, తూర్పుకంభంపాడు భూములకు సంబంధించి రీసర్వే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ తహసిల్దార్ పుట్టాబత్తిన విజయ్‌కుమార్ పేర్కొన్నారు. గ్రామాల్లో పొలాలకు సంబంధించిన డాక్యుమెంట్ల పరిశీలించి రీసర్వే నిర్వహించి న్యాయం చేస్తామన్నారు. రైతులు తమకు అవసరమైన భూములకు సంబంధించిన రికార్డులను రీసర్వేకు హాజరయ్యే సిబ్బందికి సూచించాలన్నారు. తద్వారా రీసర్వే సక్రమంగా జరిగేందుకు సహకరించాలన్నారు . త్వరలో జరగనున్న 8వ విడత భూపంపిణీకి సంబంధించి గ్రామాల్లో ఖాళీ భూములను గుర్తించి గ్రామసభలు నిర్వహించి అర్హులైన వారికి అందజేసేందుకు ప్రణాళికను సిద్ధం చేశారన్నారు. 9న పాతపాడు, పెళ్ళేరు, 10న మాముడూరు, పాడేరు, తిమ్మాయపాళెం, గొల్లపల్లి, 11న వావిలేరు, మైపాటివారికండ్రిక, ఏటూరు, 12న చిత్తలూరు, నెర్నూరు, 13న నాగులవెలటూరు, కాళాయపాళెం, బిల్లుపాడు గ్రామాలకు సంబంధించి గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేస్తారని మండల ప్రజలు సహకరించాలని ఆయన సూచించారు.

# తొక్కిసలాటలో మృతిచెందిన మహిళకు నివాళి



**ఉలవపాడు,జనవరి7,ప్రభాతవార్త:** కందుకూరు చంద్రబాబు ర్యాలీలో ఉలవపాడుకు చెందిన ఓ మహిల మృతిచెందారు.తొక్కిసలాటలో యాటగిరి విజయ మృత్యువాతపడ్డారు.శనివారం తెలుగుదేశం నాయకులు ఆమె ఇంటి వద్ద కార్యక్రమం నిర్వహించారు. ఆమె ఫోటోకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.కుటుంబసభ్యులను ఓదార్చారు.వారి కుటుంబసభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మొగిలి కల్లయ్య,కత్తి పద్మ,ఆవులమడుగు కళావతి, రావూరి శ్రీనివాసరావు, రాచగల్లు శివ,పసుపులేటి రాము,చలంచర్ల ప్రసాద్,ఉమ్మడి ప్రకాశం జిల్లా గిరిజన జాగృతి వేదిక అద్యక్షులు కత్తి బాలకోటయ్యతో పాటు పలువురు తెలుగుదేశం నాయకులు,గిరిజన సంఘం సభ్యులు హాజరైయ్యారు.

## పాఠశాలల సమగ్ర అభివృద్ధికే ప్రణాళికలు



**బుచ్చి జనవరి 7 ప్రభాతవార్త** పాఠశాలల సమగ్ర అభివృద్ధికోసమే ప్రధానోపాధ్యాయులు పేరెంట్స్ కమీటితో చర్చించి ప్రణాళికలు తయారు చేయాలని ఎంఇఒ ఎం .దిలీప్‌కుమార్ తెలిపారు.2023-24 విద్యాసం వత్సరానికి సంబంధించి పాఠశాలల ప్రణాళికల తయారీ,సుస్దిరాభివృద్ధి లక్ష్యాల సాధనకోసం ప్రధానో పాధ్యాయులు పేరెంట్స కమీటి సభ్యులతో శిక్షణాకార్యక్రమం మండల విద్యాశాఖా కార్యలయంలో నిర్వ హించారు.ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతు పాఠశాలలో అమలౌతున్న రాష్ట్ర ప్రభుత్వ కార్యక్ర మాలు,పిల్లల నూతన ఆవిష్కరణలు,మౌలిక సదుపాయాలు ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల సమాచారం సక్రమంలో పొందుపరచాలన్నారు. పర్యావరణ పరిరక్షణ, జన సంరక్షణ, స్వచ్ఛత పాఠశాల తదతర వివరాలు ప్రణాళికలో ఉండాలన్నారు.8,9 తేదిలలో గ్రామసభలు నిర్వహించి అందరితో చర్చించి సకాలంలో అందజేయాలన్నారు. ఈకార్యక్రమానికి రిసోర్స్ పర్సన్స్‌గా పెనుబల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.వి రత్నం,జిల్లా రిసోర్‌గ్రూప్ సభ్యులు గండికోట సుదీర్‌కుమార్, సిఆర్‌పి మలేశ్వరరెడ్డి, వ్యవహారించారు. ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు, పేరెంట్స్ కమీటి సభ్యులు పాల్గొన్నారు.

## జైభీమ్ దళిత ప్రజావేదిక ఆధ్వర్యంలో 9న చలో కావలి

**బిట్రగుంట, జనవరి 7 ప్రభాతవార్త** కావలి నియోజకవర్గంలో అగ్రవర్ణాల రాజకీయ చదరంగంలో బలైపోతున్న దళితుల్ని ఆదుకునేందుకు జైభీమ్ దళిత ప్రజావేదిక ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదిన జిల్లా అధ్యక్షులు దవణం అశోక్ పిలుపు మేరకు చలో కావలి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల అంబేద్కర్ సేవాదళ్ వ్యవస్థాపక అధ్యక్షులు బత్తుల రవిచంద్ర తెలిపారు. మండల కేంద్రమైన బోగోలులో శనివారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ కావలి నియోజకవర్గంలో దళితులపై జరుగుతున్న వరుస దాడులపై చేపడుతున్న చలో కావలి కార్యక్రమాన్ని పార్టీలకతీతంగా దళిత సంఘాలు, ప్రజాసంఘాలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం కావలి అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించబడుతుందన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు, దళిత మహిళలపై అత్యాచారాలు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతుండటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ దాడులను ఖండించేందుకు దళిత సంఘాలంతా ఐక్యమై డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఇచ్చిన ఓటు హక్కు ఆయుధంతో రాబోయే ఎన్నికలలో దాడులకు ఉపక్రమించే పార్టీలకు వ్యతిరేకంగా ఓటు వేసి గద్దెదించాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికలప్పుడు దళితులను అన్ని విధాలుగా ఉపయోగించుకొని ఆ తర్వాత వారినే అణగదొక్కుతున్న వారికి గట్టి బుద్ది చెప్పేందుకు చలో కావలి సందర్భంగా భవిష్యత్ కార్యక్రమాన్ని రూపొందించడం జరుగుతుందన్నారు.

## జువ్వలదిన్నెలో నూతన పింఛన్లు పంపిణీ



**బిట్రగుంట, జనవరి 7 ప్రభాతవార్త** బోగోలు మండలం జువ్వలదిన్నె గ్రామ సచివాలయం నందు నూతనంగా పింఛన్లు మంజూరైన 17 మందికి గ్రామ సర్పంచ్ మామిడి అంకమ్మ పెన్షన్ల వారోత్సవాల సందర్భంగా శనివారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్.కె.అబ్దుల్ జహీర్, ఎంపిటిసివై.కొండయ్య, గ్రామకాపులు మామిడి గోవిందస్వామి, సచివాలయ కన్వీనర్లు పోలయ్య, వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## నేడు జక్కేపల్లిగూడూరులో గడపగడపకు మన ప్రభుత్వం

**బిట్రగుంట, జనవరి 7 ప్రభాతవార్త** బోగోలు మండలం జక్కేపల్లిగూడూరు గ్రామ సచివాలయ పరిధిలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పాల్గొంటారని మండల వైసిపి కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## మానవత్వం చాటుకున్న వాలంటీర్ యనమల చైతన్య



**కావలి రూరల్, జనవరి 7 ప్రభాతవార్త** కావలి పట్టణ 33వ వార్డుకు చెందిన ద్రోణాదుల రాఘవ అనారోగ్యంతో బాధపడుతూ గుంటూరులో చికిత్స పొందుతుండటంతో 24వ నెంబరు సచివాలయ వాలంటీర్ యనమల చైతన్య గుంటూరుకు వెళ్లి ఆయనకు పెన్షన్ నగదు అందజేసి మానవత్వం చాటుకున్నారు. కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి స్ఫూర్తితో స్థానిక 33వ వార్డు వైసిపి ఇన్‌చార్జ్, మాజీ కౌన్సిలర్ అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్తా సూచనలతో వాలంటీర్ చైతన్య గుంటూరులో చికిత్స పొందుతున్న ద్రోణాదుల రాఘవకు పెన్షన్ నగదు అందజేశారు. ఈ సందర్భంగా ద్రోణాదుల రాఘవ కుటుంబ సభ్యులు చైతన్యను అభినందించారు. రాఘవ అనారోగ్యంతో కదలలేని పరిస్థితులలో వుండటంతో ఇంతదూరం వచ్చి పెన్షన్ అందజేయడం పట్ల వారు కృతజ్ఞతలు తెలిపారు.

## బొల్లినేనికి ల్యాప్‌ట్యాప్‌లు అందజేసిన దనియాల



**కలిగిరి, జనవరి 7, ప్రభాతవార్త;** యన్నారై దనియాల వెంకటేశ్వరావు బిటెక్ చదివే పేద విద్యార్దులకు ఉచితంగా ల్యాబ్ ట్యాబ్‌లు అందజేసేకార్యక్రమాన్నిబొల్లినేని చేతుల మీదుగా ప్రారంబించా రు. శనివారం కలిగిరిలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ ట్యాబ్‌ల పంపిణీ కార్యక్ర మాన్ని ప్రారంబించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముక్యఅతిదిగా పాల్గొన్న బొల్లినేని వెంకట రామారవు మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీ ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు మాత్రమే చేపడుతుందన్నా రు. అందులో బాగంగానే యన్నారై దనియాల వెంకటేశ్వరరావు ఈ ప్రాతం వైరై ఉండి పేదవిధ్యార్దులకుతమవంతు సహాచం చేయాలనే ఉద్దేశ్యంతోతమ తల్లిదండ్రులైన దనియాలనాగయ్య, వెంకటమ్మల జ్ఞాపకార్ధం చారిటీబుల్ ట్రస్ట్ ద్వారా బిటెక్‌లో 70శాతం పైగా మార్కులు సాదించిన విధ్యార్దులకు ఉచితంగా ల్యాబ్ ట్యాబ్‌లు అందజేయనున్నారన్నారు. ఈ కార్యక్రమం మొదట ఉదయగిరి నియోజక వర్గంలోని వరికుంటపాడు, దుత్తలూరు, కొండాపురం, కలిగిరి. 4మండలాలకు చెందిన100మంది విద్యార్దులకు అందజేయనున్నారన్నారు. రెండవ ధఫా మిగిన 4మండలాలబిటెక్ విధ్యార్దులకు అందజేయడం జరుగుతందన్నారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పుట్టిన గడ్డకు తమవంతు కొంతైనా రుణం తీర్చుకోవాలని , తమసంపాదనలో కొంతబాగమైన పేదవిద్యార్దుల భవిస్యత్కుఉ ఉపయోగ పడాలని ఈకార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో బిజ్జం క్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీ



**కోవూరు, జనవరి 7 ప్రభాతవార్త :** కోవూరులోని జాతీయ రహదారి ఇనమడుగు గేట్ సమీపంలో శనివారం సాయంత్రం కోవూరు సెబ్ సీఐ ఆర్. నరహరి బృందంతో కలిసి వాహనాల తనిఖీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెబ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ తనిఖీలను చేపట్టడం జరిగిందన్నారు. కోవూరు సెబ్ సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాల్లో ఏ ప్రాంతంలోనైనా అక్రమంగా మద్యం నిల్వ ఉండడం గానీ, గంజాయిగానీ , నిషేదిత గుట్కాలు ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో కోవూరు సెబ్ ఎస్సైలు శ్రీధర్, శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

## వేడుకగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వామి కళ్యాణ మహోత్సవం



**కొడవలూరు జనవరి 6 ప్రభాతవార్త:** కొడవలూరు మండలం, రామన్నపాలెం గ్రామంలో వెలసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వామి కళ్యాణ మహోత్సవమును గ్రామస్తులు వేడుకగా, అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు విచ్చేశారు. ఆయనకు గ్రామస్తులు మంగళవాయిద్యాలతో, బాణాసంచారాలతో ఘనస్వాగతం పలికారు. గ్రామస్తులు ఆయనకు శాలువాలతో కప్పి సన్మానించారు.. అనంతరం స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కందుల విజయ్ కుమార్, కాకి శ్రీనివాసులు, కాకి సుమన్, కరేటి సుందర్‌రెడ్డి, పెన్నంరెడ్డి సాయిమోహన్‌రెడ్డి, శ్యామ్‌సుం దర్‌రెడ్డి తదితరులు పాల్గోనారు.

## నిరంజన్‌బాబురెడ్డికి ఘన సన్మానం



**కోవూరు, జనవరి 7 ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులుగా నియమితులైన దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డిని శనివారం ఆయన కార్యాలయంలో కోవూరు మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు ప్రసాద్‌రెడ్డి శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా వైసీపీ సీనియర్ నాయకులు టి. భాస్కర్, గంగవరం సర్పంచ్ లక్ష్మీకుమారి, ఉపసర్పంచ్ మోషే, శివాలయం చైర్మన్ సురేష్, జడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, మండల సోషల్ మీడియా కన్వీనర్ కె. ప్రసాద్, బీసీ సెల్ అధ్యక్షులు కె. మల్లికార్జున, యువజన విభాగం అధ్యక్షులు బి. చిరంజీవి, ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, తదితరులు కలిసి శాలువా పూల మాలలతో ముంచెత్తారు.

## స్వచ్ఛ గ్రామాలకు ప్రజలు సహకరించాలి



**కోవూరు, జనవరి 7 ప్రభాతవార్త :** గ్రామాలు స్వచ్ఛగ్రామాలుగా తయారయ్యేందుకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని పంచాయతీ కార్యదర్శి శివకుమార్ తెలిపారు. కోవూరు పంచాయతీ పరిధిలోని రామనాథపురం తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు చెత్తాచెదారాలను ఎక్కడంటే అక్కడ పడవేయకుండా పంచాయతీ ఏర్పాటు చేసిన చెత్తకుండీలను ఉపయోగించుకోవాలన్నారు.

**– పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టి** కోవూరు పంచాయతీ పరిధిలో ఇంటి పన్నులు, కుళాయి పన్నులపై బిల్ కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి ఇచ్చిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలని గ్రామ సర్పంచ్ విజయ పేర్కొన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయ సమావేశ మందిరంలో బిల్ కలెక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు కూడా పంచాయతీ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని సకాలంలో ఇంటి పన్నులు, కుళాయి పన్నులు చెల్లించాలన్నారు. పన్నులు సక్రమంగా చెల్లించని వారికి సంబంధించిన కుళాయిలను నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు. అవసరమైతే మొండి బకాయిలు ఉన్నవారికి కోర్టు ద్వారా నోటీసులు పంపడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

## నిర్మాణం సకాలంలో పూర్తికావాలి



**కోవూరు, జనవరి 7 ప్రభాతవార్త :** కోవూరులోని శాఖా గ్రంథాలయం నిర్మాణ పనులను సంబంధిత ఎగ్జిక్యూ టివ్ ఇంజనీరు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపట్టే ఈ పనులు నాణ్య తా ప్రమాణాలతో పాటు సకాలంలో పూర్తిచేసేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ పరిశీలనలో ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, వార్డు సభ్యులు అనూప్‌రెడ్డి, శివాలయం చైర్మన్ సురేష్, నేతలు సాయియశ్వంత్‌రెడ్డి, నాగరాజు, శేఖర్‌స్వామి, తదితరులు ఉన్నారు.

## నూతన అంశాలపై అవగాహన పెంచుకోవాలి



**కోవూరు, జనవరి 7 ప్రభాతవార్త :** ఇంజనీరింగ్ విద్యార్థులు నూతన అంశాలపై అవగాహన పెంచుకుని ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించే దిశగా ముందుకు సాగాలని కళాశాల కరస్పాండెంట్ ఎన్. సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్‌ఈ డేటా సైన్స్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు ఉన్నత విద్యతో పాటు సామాజిక సేవ, పరిశ్రమ స్థాపనకు అవసరమైన సూచనలు కూడా అందించేలా ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సంయుక్త కార్యదర్శి పి. శ్రీనివాసులురెడ్డి, కోశాధికారి వై. విజయ్‌శంకర్‌రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ జి. సుబ్బారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్‌కుమార్, సీఎస్‌ఈ విభాగాధిపతి గాయత్రి , డేటా సైన్స్ విభాగాధిపతి సాయిప్రసాద్‌రెడ్డి, ఏఈఎంఎల్ విభాగాధిపతి డాక్టర్ నాగేంద్రకుమార్, సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ పీఎం కిషోర్, అధ్యాపకులు ఉన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభను అలరింపజేశాయి.

## నేడు సినీ నటుడు అలీచే కొండూరుకు పౌర సన్మానం

**నెల్లూరుటౌన్, జనవరి 7, ప్రభాతవార్త:** ప్రముఖ సినీ హాస్యనటుడు, రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారులు అలీ ఈ నెల 8వ తేదీన ఆదివారం నెల్లూరు వస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్ కేంద్రంగా అంతర్జాతీయంగా కళా రంగానికి సేవలు అందిస్తున్న కళ 10వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొ నేందుకు అలీ వస్తున్నారని సీనియర్ పాత్రికేయులు డాక్టర్ మహమ్మద్ రఫీ తెలిపారు. శనివారం నెల్లూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డాక్టర్ మహమ్మద్ రఫీ, డాక్టర్ కొండూరు హరినారాయణరెడ్డి, పి.అమానుల్లా ఖాన్, దగ్గుపాటి రాధాకృష్ణ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ బాషా సృజనాత్మక సమితి కలయిక ఫౌండేషన్ కళ సంయుక్త ఆధ్వర్యంలో 8వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు నెల్లూరు టౌన్‌హాలులో జరిగే ఈ వేడుకలో సమాజ సేవకులు, 5వేల వివాహాలు చేయించిన డాక్టర్ కొండూరు హరినారాయణరెడ్డిని సింహపురి సేవా సార్వభౌమ బిరుదుతో సత్కరిస్తున్నారు. డాక్టర్ కొండూరు హరినారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్టు లోగో ఆవిష్కరణలో రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పూర్వ పార్లమెంట్ సభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొంటారని, తెలంగాణకు చెందిన 30 మందది సురభి కళాకారులు ఘంటసాల నాటకం ప్రదర్శించనున్నట్లు డాక్టర్ మహమ్మద్ రఫి వివరించారు. హైదరాబాద్ నుంచి ప్రముఖ నర్తకి రోహిణి కందాల, మిమిక్రీ స్టార్ రమేష్ ఈ వేడుకల్లో పాల్గొంటున్నారు. పెద్ద ఎత్తున కళాభిమానులు విచ్చేసి జయప్రదం చేయాల్సిందిగా ఆహ్వానిస్తున్నారు.

## సుబ్బరామయ్యకు ఆర్ధిక సహాయం అందించిన సుధారాణి



**నెల్లూరు జనవరి 7, ప్రభాతవార్త– వైద్యం** హౌసింగ్ బోర్డు కాలనీ 24వ డివిజనులో ఉంటున్న నిరుపేద అన్నవరం. సుబ్బరామయ్య ఊపిరితిత్తులల్లో ఇన్‌ఫెక్షన్ చేరి అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న ఆయనను రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ తడకపల్లి.సుధారాణి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆర్ధికంగా ఇబ్బందులు ఎదుర్కొం టున్న తరుణంలో విషయం తెలుసు కున్న నెల్లూరు పార్లమెంటు తెలుగు మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి తడకపల్లి .సుధా రాణి వారి కుటుంబానికి రూ.10వేల ఆర్ధిక సహాయం, నిత్యావసర సరుకులను అందించారు. సుధారాణి మాట్లాడుతూ వారికి కుటుంబ సభ్యులకు తాము అం డగా ఉంటామని ఆమె హామీ ఇచ్చారు. ఆమెతోపాటు నెల్లూరు పార్లమెంటు టీడీపీ కార్యదర్శి ఈదర.శ్రీని వాసులు, రూరల్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఉయ్యాల.జగన్మోహన్, రూరల్ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి చింతకుంట.వెంకటశేషయ్య తదితరులు పాల్గొ న్నారు.

## 8వ విడత భూపంపిణీని సద్వినియోగం చేసుకోండి

**మర్రిపాడు, జనవరి7 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం త్వరలో 8వ విడత భూపంపిణీ కార్యక్రమాన్ని చేపట్టనుందని మండల డిప్యూటీ తహసిల్దార్ ఆనందరావ్ తెలిపారు. మర్రిపాడు మండలం డిసిపల్లిలో భూపంపిణీకి సంబంధించి శనివారం సాయంత్రం గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ పరిధిలోని అర్హులైన పేదలంతా భూముల కొరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు . స్థానిక పంచాయతీ సర్పంచ్ రేవూరు సుప్రజా గోపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో సచివాలయ విఆర్ఒ గౌస్‌బాషా, ఎంపిటిసి సభ్యులు పేర్నాటి దొరసానమ్మ, స్థానిక నాయకులు, అర్జీదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడుతాయి



ఉదయగిరి జనవరి 7 ప్రభాతవార్త ఉదయగిరి మండలం కృష్ణం పల్లిలో మెఘా క్రికెట్ టోర్నమెంట్‌ను ఉదయగిరి సర్కిల్ ఇనస్పెక్టర్ వి.గిరిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు యువకులు క్రీడా స్ఫూర్తితో మెలగాలని క్రీడలు శారీర దారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. క్రీడాలు పోరాట పటిమను పెంచుతాయని వ్యక్తుల మధ్య స్నేహన్ని పెంపొందించే విధంగా క్రీడలు ఉండాలని తెలిపారు. యువకులలో ఉత్సాహం నింపేందుకు సిఐ గిరిబాబు కాసేపు క్రికెట్ ఆడారు.

## ముఖ్యసలహాదారునికి సన్మానం



వింజమూరు, జనవరి7 ప్రభాతవార్త: ఎపి దేవాదాయ, ధర్మాదాయ శాఖ ముఖ్య సలహాదారుడు జ్వాలాపురం శ్రీకాంత్‌ను ఆంధ్ర ప్రదేశ్ బ్రాహ్మణ సంఘ సభ్యులు పసుపులేటి భవానీ శంకర్ శర్మ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు . తెలంగాణా నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మెన్ సముద్రాల వేణుగోపాలాచారిని కలిసి అభినందనలు తెలిపారు .సందర్భంగా భవానీశంకర్ శర్మ మాట్లాడుతూ బ్రాహ్మణ సేవా సంఘానికి తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రభుత్వ శాఖల అధికారులు ఆయా రాష్ట్రాల్లోని బ్రాహ్మణులకు ప్రభుత్వ పరమైన సహాయసహకారాలు అందించేలా కృషి చేయాలన్నారు. హిందూధర్మపరిరక్షణకు శాఖాపరమైన చర్యలు చేపట్టాలన్నారు.

## నాడు-నేడు పనులు పరిశీలన



వింజమూరు, జనవరి7ప్రభాతవార్త:వింజమూరులోని బాలికోన్నతపాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు అభివృద్ధి పనులను ఎంపిపి ఇనగనూరి మోహన్‌రెడ్డి పరిశీలించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చేపడుతున్న పనుల్లో ఎలాంటి అవకతవకలు లేకుండా నాణ్యతాప్రమాణాలతో పనులు పూర్తిఅయ్యేలా చూడాలన్నారు. భవనాలు పూర్తయితే విద్యార్థులకు ఎంతో సౌకర్యవంతంగా చదువుకునేందుకు వీలుంటుందన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు ఎల్.వి.సీతారామయ్యను పాఠశాలలో విద్యార్థుల సంఖ్య , మధ్యాహ్న భోజనం నిర్వహణ గురించి తెలుసుకున్నారు. విద్యార్థులకు చక్కటి బోధనను అందించిమండల స్థాయిలో విద్యార్థులు పరిక్షల్లో ప్రథమస్థానంలో నిలవాలన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలోఉచిత వైద్య పరిక్షలు

**కొడవలూరు జనవరి 7 ప్రభాతవార్త:** శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో " క్యాన్సర్ కారక వ్యాధులు – నివారణ పై అవగాహన సదస్సుమరియు ఉచిత వైద్య పరిక్షలను కొడవలూరు మండలం, నార్త్‌రాజుపాలెంలోని శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల నందు శనివారం ఎన్ఎస్ఎస్ యూనిట్ పర్యవేక్షణలో ఇంజనీరింగ్ విద్యార్థులకు కాన్సర్ సంబంధిత వ్యాధులు – నివారణపై అవగాహన సదస్సు కార్యక్రమం జరిగినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి. కుమార్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మెడికోవర్ హాస్పిటల్ నుండి ముఖ్యఅతిథిగా డాక్టర్ పిజిఎస్ఆర్ ప్రియ విచ్చేశారు. ఈ కార్యమ్రంలో ఆమె విద్యార్థలకు క్యాన్సర్ కారక ఆహరకాలు వాటి ఫలితంగా వచ్చే సమస్యలపై విపులంగా విశదీకరించారు. జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని రంగులు కలిపిన ఆహారపదార్థాలను తీసుకోరాదని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్ మరియు వైద్య సిబ్బంది ఉచితంగా సుమారు 70మంది కళాశాల సిబ్బందికి బిపి, షుగర్ మరియు అవసరమైన వారికి ఇసిజి పరిక్షలు చేయడంతో పాటు తగు సూచనలు ఇవ్వడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు. సంస్థ తరఫున వైద్య బృందానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ పెనుబల్లి బాబు నాయుడు, డైరెక్టర్ కృష్ణచైతన్య, ఇతర డైరెక్టర్లు, ఎన్ఎస్ఎస్ యూనిట్ పోగ్రాం ఆఫీసర్ డాక్టర్ టి. సుబ్రహ్మణ్యం, వైద్య సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



**సంగం జనవరి 7 ప్రభాతవార్త** సంగం మండలంలోని తరుణవాయి గ్రామం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని దువ్వూరుకి చెందిన రేబాల అశోక్‌రెడ్డి అనే వ్యక్తికి మృతి చెందినట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. తరుణవాయి వద్ద సంఘటన జరిగిన విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ నాగార్జునరెడ్డి సంఘటనాకి స్థలానికి చేరుకొని క్షతగా త్రుడ్ని బుచ్చిరెడ్డిపాళెంలోని వైద్యశాలకు తరలించారు. వైద యశాలకు తీసుకొని వెళ్లేలోపు అశోక్‌రెడ్డి మృతి చెందినట్లు తెలిపారు. తరుణవాయి వద్ద పొలం వద్దకు వచ్చి తిరిగి దువ్వూరుకు మోటార్ బైకుపై వస్తున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనగా ఆయనకు తీవ్రగాయాలు అయ్యాయి. వైద్యశాలకు తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటన దువ్వూరు గ్రామంలో విషాధ చాయలు అలముకున్నాయి.

## దివ్యాంగులకు వైకల్య నిర్ధారణ పరీక్షలు



**కావలి రూరల్, జనవరి 7 ప్రభాతవార్త** జిల్లా సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో శనివారం కావలి జెడ్పీ బాలుర పాఠశాల ఆవరణలోని కావలి మండలంలోని భవిత దివ్యాంగుల పాఠశాల నందు విభిన్న ప్రతిభావంతులకు వైకల్య నిర్ధారిత, మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్న కావలి తహశీల్దార్ కోలగట్ల మాధవరెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో పిల్లల యొక్క వైకల్యమునకు తగిన విధంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన ఉపకరణాలను నిర్ధారించడం జరిగింది. అనంతరం 200 మందికి భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఇవో శ్రీధర్, ప్రధానోపాధ్యాయిని నీరజ, జిల్లా ఐఇ కోఆర్డినేటర్ ధనమ్మ, ఐఇఆర్‌పిలు, ఆడియాలజిస్ట్ ఝాన్సీ, ఫిజియోథెరిపిస్ట్ స్వర్ణలత, పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రికార్డులను పరిశీలించిన ఇఒపిఆర్‌డి




సీతారామపురం జనవరి 7 ప్రభాతవార్త ప్రభుత్వం అందిస్తున్న అన్ని సర్వీసులను సచివాలయాలలో ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఇంచార్జి ఇఒపిఆర్‌డి షేక్.ఖాదం్‌భాషా తెలిపారు. శనివారం మండ లంలోని పబ్బులేటిపల్లి సచివాలయాన్ని ఆ కస్మికంగా తనీకి చేసిరికార్డులను పరిశీలించారు. మాట్లాడుతు ఆయుష్మాన్ భారత్ సర్వేను త్వరగా పూర్తి చేయాలనిఎప్పటికప్పుడు ఇంటిపన్నులను నూరు శాతం వసూలు చేసి పంచాయితీ ఆదాయానికి దోహదపడాలన్నారు. ప్రభుత్వ సర్వీసులను పెంచాలని ప్రతి రికార్డును సరిగా నిర్వహించుకోవాలని సూచించారు.

వార్త CLASSIFIEDS వార్త

WANTED BRIDES
★ 2ND MARRIAGE BOY SMP invites Alliance for their Son B.vom Ht 5.11, 39 Yrs, Working in MNC @Chennai Looking for inter, Any Graduation or PG Khula Girl, Widow with one kid or no kid. Age in between 28-33 yrs. Contact: 8072892229 or 9344692727.
(Ro.No.47407)

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

